


స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయండి : కలెక్టర్

కంటోన్మెంట్ : జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, నివేదికను సమర్పించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలో పిసిపిఎన్‌డిటి చట్టం అమలుపై తమ ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. నెల వారీగా జరుగుతున్న స్కానింగ్, ప్రసవాలు, అనధికారికంగా ఆసుపత్రుల్లో జరుగుతున్న గర్భస్రావాల గురించి ప్రశ్నించారు. గర్భస్థ లింగ నిర్ధారణ చేయడం నేరమని, ఇలా చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల రెన్యువల్, కొత్త వాటికి అనుమతులపై చర్చించారు. సరోగసీ కేంద్రాలకు కూడా రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీకి ఆర్‌డిఒ, డిఎస్‌పి, డిడిఎంఅండ్‌హెచ్‌లతో కమిటీలను వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ బృందాలు తనిఖీ చేసి తమకు నివేదికను అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ జీవనరాణి, డిసిహెచ్ఎస్ పద్మశ్రీరాణి, ఎడిఎంహెచ్ఒ కె.రాణి, డిడిఎంహెచ్ఒలు ఎన్.సూర్యనారాయణ,చాముండేశ్వరి, డిఐఒ అచ్యుతకుమారి, డిపిఎంఒ రవికుమార్ రెడ్డి , డిఎస్‌పి గోవిందరావు, ఆర్‌డిఒ డి.కీర్తి పాల్గొన్నారు.



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఉచిత బస్సు కిరికిరి

ప్రభుత్వం.. ఉచిత బస్సు (స్త్రీశక్తి)పథకంలో చాలా కిరికిరిలు పెడుతోంది. ఫలితంగా మహిళలు ఛార్జీలు చెల్లించుకొని ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా ఎక్స్‌ప్రెస్ బస్సులను సూపర్ డీలక్స్ బస్సులుగా మార్చడం, ఉన్న బస్సులను మెయింటెన్సు పేరిట తగ్గించడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎక్కువ మంది మహిళలు సూపర్ డీలక్స్ బస్సుల్లోనే ప్రయాణించాల్సి వస్తోంది.

- **భారీగా బస్సులు తగ్గించిన ఆర్‌టిసి**
- **డీలక్స్ బస్సులుగా మారిన ఎక్స్‌ప్రెస్ సర్వీసులు**
- **నిర్వహణ పేరిట హయర్ బస్సులు నిలిపివేత**
- **ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు**

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఐదు రకాల బస్సుల్లోనే ఉచిత ప్రయాణమని చెప్పడంతో ప్రయాణికులకు ఇబ్బందులు మొదలయ్యాయి. పైగా దూర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులను బాగా తగ్గించడం, బస్సు వేళలు మార్చేయడం వల్ల మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 137 బస్సులను విజయనగరం, ఎస్.కోట డిపోల పరిధిలో నడుపుతున్నట్లు డిపిటిఒ జి.వరలక్ష్మి తెలిపారు. ఇందులో పల్లె వెలుగులు 108, అల్ట్రా పల్లె వెలుగులు 7, మెట్రో 14, ఎక్స్‌ప్రెస్ 8 బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు . అయితే ఉచిత ప్రయాణంతో ప్రయాణికుల సంఖ్య రోజుకూ పెరుగుతోంది. పెరుగుతున్న ప్రయాణిక సంఖ్య అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయకపోగా, ఉన్న బస్సుల్లో కొన్నింటిని నిలిపివేశారు. ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు వంటి బస్సు సర్వీసులను తగ్గించడంతో గంటల తరబడి బస్టాండ్‌లలో మహిళలు వేచి ఉండాల్సి వస్తోంది. జిల్లా మొత్తంగా ఏడు ఎక్స్‌ప్రెస్‌లను మాత్రమే నడుపుతున్నారు. దీంతో అనివార్యంగా అల్ట్రా డీలక్స్, సూపర్ డీలక్స్ వంటి బస్సులు ఎక్కి మహిళలు టికెట్ ఛార్జీలు చెల్లించుకోవలసి వస్తుంది. అంతేకాకుండా ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కువ సర్వీసులను విజయనగరం-విశాఖ నాన్‌స్టాప్ బస్సులుగా మార్చేశారు. మరోవైపు ఎక్స్‌ప్రెస్‌లను, అల్ట్రా పల్లెవెలుగు బస్సులను తగ్గించడంతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు.

ఉన్న బస్సులనే నడుపుతున్నాం

డిపో పరిధిలో ఉన్న బస్సులనే నడుపుతున్నాం. ఎక్కడా తగ్గించలేదు. మా దగ్గర 36 పల్లె వెలుగు, 7 ఎక్స్‌ఎస్‌లు, 14 అల్ట్రా డీలక్స్, 3 అల్ట్రా పల్లె వెలుగు బస్సులు నడుపుతున్నాం. ప్రయాణికులకు తెలియక అపోహ పడుతున్నారు. ఏమైనా కొత్త బస్సులు వస్తే పెంచుతాం తప్ప మేమేమీ చేయలేం.

- జి.శ్రీనివాసరావు, డిపో మేనేజర్, ఎపిఎస్‌ఆర్‌టిసి విజయనగరం



బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

గంటల తరబడి నిరీక్షణ

బస్సులను తగ్గించడంతో ప్రయాణాల కోసం గంటల తరబడి బస్టాండ్‌లలో మహిళలు వేచి ఉండాల్సి వస్తోంది. విశాఖపట్నం పార్వతీపురం, శ్రీకాకుళం, సాలూరు ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగస్టు 15 ముందు వరకు అధికంగా ఉండేవి. సూపర్ లగ్జరీ బస్సులు తక్కువగా ఉండేవి. కానీ ఎక్స్‌ప్రెస్‌లన్నింటినీ సూపర్‌లగ్జరీగా మార్చడంతో ప్రయాణికులు గంటల తరబడి బస్టాండ్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో విసిగి వేసారిపోయిన మహిళలు అల్ట్రాడీలక్స్ బస్సులు ఎక్కి ఛార్జీలు చెల్లించుకోవాల్సి వస్తోంది.

» విశాఖ నుంచి పార్వతీపురం వెళ్లేందుకు శుక్రవారం ఉదయం ఓ మహిళ విశాఖ బస్టాండ్‌లో వేచి ఉంది. ఎంతకూ ఎక్స్‌ప్రెస్, ఇతర ఉచిత బస్సులు రాకపోవడంతో విసిగిపోయి నాన్‌స్టాప్ బస్సు ఎక్కి విజయనగరంలో ఉదయం 9గంటలకు దిగింది. అక్కడి నుంచి పార్వతీపురం వెళ్లేందుకు సుమారు గంటసేపు విజయనగరం బస్‌స్టేషన్‌లో వేచి ఉంది. అయినా ఎక్స్‌ప్రెస్‌లు గాని, పల్లెవెలుగు గాని రాకపోవడంతో అల్ట్రాడీలక్స్ బస్సుఎక్కి ఛార్జీలు చెల్లించుకొని పార్వతీపురం వెళ్లాల్సి వచ్చింది. దీంతో పేరుకే ఉచిత బస్సు అని ఛార్జీలు తప్పడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

» విశాఖపట్నం నుంచి విజయనగరానికి బయలుదేరిన ఎపి 39 యు ఎక్స్ 2455 నెంబర్ గల బస్సు దాని డిజైన్, రంగును బట్టి ఎప్పుడూ ఉన్నట్టే ఎక్స్‌ప్రెస్ అనుకొని ప్రయాణికులు ఎక్కారు. తీరా ఇది నాన్‌స్టాప్ అని ఫ్రీ టిక్కెట్ వర్తించదని డ్రైవర్ చెప్పడంతో మహిళలంతా దిగిపోయారు. ప్రతి స్టేజి వద్ద ఇదే పరిస్థితి ఎదురైంది. బస్సుల కుదింపుపై పలువురు ప్రయాణికులు ఆర్‌టిసి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా వారంతా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు.

రైతులు ఆందోళన చెందొద్దు

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఎరువులకు కొరత లేదని, సరిపడి నంత స్టాకు సిద్ధంగా ఉందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని ఆయన కోరారు. రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డిజిపి, ఇతర ఉన్నతాధికారులు వివిధ జిల్లాల కలెక్టర్లు, జెసిలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు మన జిల్లాలోని ఎరువుల పరిస్థితి, పంటల స్థితిగతులను వారికి కలెక్టర్ అంబేద్కర్ వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో జిల్లాలో ఇప్పటివరకు 84,998 హెక్టార్లలో వివిధ పంటల సాగు జరిగిందని తెలిపారు. గత ఏడాదితో పోల్చితే, ఈ ఏడాది ఇప్పటివరకు 11 శాతం అధికంగా సాగయ్యిందని తెలిపారు. గత సంవత్సరం ఇదే సమయానికి వివిధ పంటల సాగు 71,684 హెక్టార్లలో జరిగిందని, 13.314 హెక్టార్లలో అదనంగా వివిధ పంటల సాగు జరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న వివిధ పంటలకు గాను 36,740 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 25,605 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందిని చెప్పారు. ప్రస్తుతం 2,339 మెట్రిక్ టన్నుల యూరియా, 1,330 మెట్రిక్ టన్నుల డిఎపి, రైతు సేవాకేంద్రాల్లోను, ప్రైవేటు వ్యాపారుల వద్ద అందుబాటులో ఉందని తెలిపారు. ఈ నెలాఖరు లోపు 3,000 టన్నుల యూరియా అవసరం ఉంటుందని ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. త్వరలోనే యూరియా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మండల స్థాయిలో తహసిల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, మండలంలోని అన్ని ఎరువుల దుకాణాలు, పిఎసిఎస్‌లు, రైతు సేవాకేంద్రాలను తనిఖీ చేయిస్తామని ప్రకటించారు. ఆయా షాపులకు సరఫరా అయిన ఎరువులు, పంపిణీ, నిల్వలపై వారం రోజులలో తమకు నివేదికను అందజేయాలని ఆదేశించారు. ఎరువులకు పక్కదారి పట్టించినా, షాపుల్లో ఎరువులతో బాటు ఇతర సరుకులు కొనాలని రైతులను బలవంతం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో జెసి ఎస్.సేతు మాధవన్, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎన్.వెంకటేష్ పాల్గొన్నారు.

పట్టణ సమస్యలపై మంత్రికి వినతి

ప్రజాశక్తి-బొబ్బిలి



మంత్రికి వినతి అందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పట్టణ సమస్యలపై మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణకు ఎమ్మెల్యే బేబినాయన, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ వినతిపత్రం అందజేశారు. అమరావతిలో శుక్రవారం మంత్రిని కలిసి మున్సిపల్ సమస్యలను వివరించారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని, ఎఐఐబి వాటర్ స్కీమ్ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు బేబినాయన చెప్పారు.

ఎటిఎల్ ల్యాబ్‌లను పరిశీలించిన బృందం

విజయనగరం టౌన్ : జెఎన్‌టియువిలో ఎటిఎల్ మూడు రోజుల మెంటర్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం జామి, రామతీర్థం జెడ్‌పి పాఠశాలలను బృందం సందర్శించి ఎటిఎల్ ల్యాబ్‌లను పరిశీలించింది. విజ్ఞానాశ్రమం పూణే మేనేజర్ కిషోర్ గైక్వాడ్ , జిల్లా సైన్సు అధికారి టి.రాజేష్ , ఎటిఎల్ రాష్ట్ర పరిశీలకులు వెంకటేష్ , రమేష్, ఇంజినీరింగ్ కాలేజీ సిబ్బంది, విద్యార్థులు ఈ బృందాల్లో ఉన్నారు. జామి ఎటిఎల్ ల్యాబ్‌లో జరుగుతున్న ప్రోగ్రాములన్నీ పరిశీలించి సంతృప్తి చెంది ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో జామి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాకబ్ ఉపాధ్యాయులు ఎస్ ఉమామహేశ్వరరావు , లలిత, రామతీర్థం ప్రధానోపాధ్యాయులు నగేష్, బిశ్రీనివాసరావు, కుమారస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి అప్పారావు

గీత కార్మికులకు ఉపాధి కల్పించాలి

ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిమ్మ అప్పారావు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

గీత కార్మికులకు ఉపాధి కల్పించి, నీరా కేఫ్‌లు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిమ్మ అప్పారావు డిమాండ్ చేశారు .శుక్రవారం ఎన్‌పిఆర్ భవన్‌లో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లును శీతల పానీయంగా అభివృద్ధి చేయాలన్నారు. ఆదరణ పథకం ప్రవేశపెట్టి అవినీతికి అవకాశం లేకుండా గీత కార్మికులకే ఇవ్వాలన్నారు. బెల్ట్ షాపులు తక్షణమే తొలగించి కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. వృత్తిలో ప్రమాదాలు తగ్గించేందుకు సేఫ్టీ మోకులు ఇవ్వాలని, కల్లు తెచ్చుకునేందుకు ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు .గీత కార్మికుల బిడ్డల చదువుతున్న వారికి ఇతర వృత్తులు చేసుకోవడానికి 50శాతం సబ్సిడీతో 10 లక్షల చొప్పున రుణాలు మంజూరు చేయాలన్నారు. నీరా తాటి ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. కల్లుగీత సమయంలో చనిపోయిన వారికి పది లక్షల రూపాయలు, శాశ్వత వికలాంగులకు లక్ష రూపాయలు చొప్పున ఇవ్వాలని కోరారు. కేరళ రాష్ట్రం వల్లే గీత వృత్తికి రక్షణ కల్పించి ఉపాధి పెంచి కల్లుకు మార్కెట్ సదుపాయం కల్పించాలన్నారు. కల్లుగీత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకునేలా కల్లు పాలసీ రూపొందించాలన్నారు. తాటికల్లులో మంచి ఔషధ గుణాలు ఆరోగ్యవంతమైన పోషకాలు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ముంత అప్పలస్వామి, సహాయ కార్యదర్శి ఎర్ని దేవుడు, జిల్లా కమిటీ సభ్యులు దుంగ వెంకటరమణ, గండిమాని వెంకటరమణ, బత్తిన అప్పలనాయుడు కొలుసు పరమేష్, లావేటి అద్దానం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-డెంకాడ (భోగాపురం)

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శుక్రవారం భోగాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్ మాట్లాడుతూ భోగాపురం మండల కేంద్రంలో ఉన్న బిసి చిన్న పిల్లల హాస్టల్ శిధిలావస్థకు చేరుకొని రెండేళ్లు గడుస్తున్నా అధికారులు నేటికీ సొంత భవనం నిర్మాణం చేయకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. సొంత భవనం లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య గత ఏడాది నుంచి సంవత్సరానికి 50 మంది విద్యార్థులు తగ్గారని, కేవలం 20 మంది మాత్రమే హాస్టల్లో ఉంటున్నారని ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. తక్షణమే హాస్టల్‌కు సొంతభవనం నిర్మాణం చేయాలని కోరారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, తల్లికి వందనం నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నెల్లిమర్ల నియోజవర్గ వ్యాప్తంగా మూడు మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఉన్నా అభివృద్ధి చెందిన భోగాపురం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. భోగాపురం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందజేశారు.

ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న జరగబోయే చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు రమణ విద్యార్థులు తేజ, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై వినతి

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శుక్రవారం డెంకాడ తహశీల్దార్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కనీసం ప్రహరీ గోడ కూడా నిర్మించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. 200 మందికి పైగా విద్యార్థులు చదువుతుంటే నాలుగు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయని, అబ్బాయిలకు అవి కూడా అందుబాటులో లేకుండా పోయాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం నిధులు తక్షణమే విడుదల చేయాలని కోరారు. సమస్యలపై ఈ నెల 25న చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్, జిల్లా కమిటీ సభ్యులు రమణ, నాయకులు వెంకటేష్ , రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : విద్యారంగ సమస్యలపై ఈ నెల 25న చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు బి.జగదీష్ విద్యార్థులను కోరారు. ఈ మేరకు చీపురుపల్లిలో శుక్రవారం చలో కలెక్టరేట్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా విద్యా రంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పేరుకుపోయాయని చెప్పారు. దీని కారణంగా విద్యార్థులు ఫీజులు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లును రూ.3 వేలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ నాయకులు శ్రీలత, మధు, సూర్య, సాయి పాల్గొన్నారు.



భోగాపురంలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

శృంగవరపుకోట : విద్యారంగ సమస్యలపై ఈ నెల 25న చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వి.భారతి మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యారంగంలో అనేక మార్పులు తెస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలని, మెస్ బిల్లు పెంచాలని, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, తదితర డిమాండ్లపై చలో కలెక్టరేట్ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఆర్.రత్న, మండల కమిటీ సభ్యులు అనిత, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.



పనసలవలసకు చేరిన తోటపల్లి సాగునీరు

ఎన్నాళ్లకెన్నాళ్లకు తోటపల్లి నీరు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని పనసలవలస, కొర్లవలస తదితర గ్రామాలకు తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. జూన్, జులై నెలల్లో తోటపల్లి ప్రాజెక్టు నుంచి ఖరీఫ్ సాగుకు నీరు వదలాలి. కానీ ఇంతవరకు కాలువలకు సాగునీరు వదలకపోవడంతో మెట్టు ప్రాంత రైతులు వ్యవసాయానికి దూరంగా ఉన్నారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్.. జల వనరుల శాఖ మంత్రిని తోటపల్లి ప్రాజెక్టు నుంచి సాగునీరు రాజాం నియోజకవర్గానికి విడుదల చేయాలని కోరడంతో విడుదల చేసినట్లు టిడిపి నాయకులు కడగల నాగరాజు తెలిపారు. రేగిడి మండలానికి తోటపల్లి నీరు చాలా కాలం తర్వాత రావడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు..

భర్త, కుమార్తెను హత్య చేసిన కేసులో

మహిళకు జీవిత ఖైదు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనులో 2015లో నమోదైన హత్య కేసులో నిందితురాలు భీమిలి మండలం నగరపాలెం గ్రామానికి చెందిన గారి వెంకట జ్యోతిర్మయి (34)కు జీవిత ఖైదు విధిస్తూ విజయనగరం ఎస్సీ ఎస్టీ కోర్టు న్యాయమూర్తి బి.అప్పలస్వామి తీర్పు వెల్లడించారు. ఆమెతో పాటు ఆ కేసులో మరో ఇద్దరు నిందితులు భీమిలి మండలం కాపుల దిబ్బవాని పాలెం గ్రామానికి చెందిన చొక్కా నరేష్ (42), ఉప్పాడ గ్రామానికి చెందిన పాడ రాజు అలియాస్ ముక్కు (38)కు 7ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు.

భీమిలి మండలం నగరపాలెం గ్రామానికి చెందిన జి. వెంకట జ్యోతిర్మయి (34)కు రమేష్ అనే వ్యక్తితో వివాహం అయ్యి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరు ఆనందపురం మండలం బొడ్డుపాలెంలో నివాసం ఉండేవారు. ఈ క్రమంలో భర్త గార రమేష్ కు సీ-మెన్ గా ఉద్యోగం రావడంతో శిక్షణ నిమిత్తం 2015లో శిక్షణకు చెన్నై వెళ్ళిపోగా, గార వెంకట జ్యోతిర్మయికి భీమిలి మండలం కాపుల దిబ్బవానిపాలెం గ్రామానికి చెందిన రాగాతి రాము అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి, ఇరువురి మధ్య అక్రమ సంబంధం ఏర్పడింది. భర్త రమేష్ శిక్షణ పూర్తి చేసుకొని చెన్నయ్ నుండి వచ్చిన తరువాత, తన భార్య జ్యోతిర్మయికి రాగాతి రాముతో అక్రమ సంబంధం ఉన్నట్లు గుర్తించి, ఆమెను ప్రశ్నించేవాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో తన భర్త అడ్డు తొలగించు కొనేందుకుగా నిందితులు ఒక ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈనేపథ్యంలో 2025 జులై 26న రమేష్ తన భార్య వెంకట జ్యోతిర్మయిని ఇదే విషయమై ప్రశ్నించగా, జ్యోతిర్మయి తన ప్రియుడు రాగాతి రాముకు ఫోను చేయడంతో ఆయన వచ్చి తలుపు చెక్కతో రమేష్ తలపై కొట్టగా, తలకు తీవ్రమైన గాయమై, రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనను జ్యోతిర్మయి రెండవ కుమార్తె సౌమ్య (6) చూసింది. నిందితుడు రాగాతి రాము, జ్యోతిర్మయి, చొక్క నరేష్, రాజు లతో కలసి రమేష్ మృత దేహాన్ని అర్ధ రాత్రి సమయంలో భీమిలి బీచ్‌కు తీసుకొని వెళ్ళి, బాడీపై పెట్రోల్ పోసి, కాల్చేశారు. అనంతరం, తిరిగి ఇంటికి వచ్చి విషయం తన రెండవ కుమార్తె సౌమ్య తో బయటపడుతుందని భావించి, ఆమెను విజయనగరం పూల్ బాగ్ తీసుకొని వచ్చి, నిర్మానుష్యంగా ఉన్న ఒక బావిలో పడేసి, చంపేశారు. ఈ విషయ్యం 2వ పట్టణ పోలీసులకు తెలిసి, కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి, వాస్తవాలను వెలికితీసి, నిందితులు నలుగురిని అప్పటి 2వ పట్టణ సిఐ అంబేద్కర్ అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో జ్యోతిర్మయికి జీవిత ఖైదు, మిగతా ఇద్దరు నిందితులకు చొక్కా నరేష్, పాడ రాజుకు ఏడేళ్ల శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అయిన రాగాతి రాము విచారణ సమయంలో రహదారి ప్రమాదంలో మరణించాడు. ఈ కేసులో నిందితులకు శిక్షపడేలా చర్యలు చేపట్టిన పబ్లిక్ ప్రాసిక్యూటరు వి.రఘురాం పోలీసుల తరుపున వాదనలు వినిపించారు. క్రియాశీలకంగా పనిచేసిన విజయనగరం 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, కోర్టు కానిస్టేబులు టి.లక్ష్మి, సి.ఎం.ఎస్. ఎఎస్ఐ పి.మల్లేశ్వరరావులను ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించారు.

ప్రజలకు మరింత చేరువగా సేవలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందల్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లా పోలీసుశాఖలో హోంగార్డులుగా పని చేస్తూ, ఇటీవల రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి వెల్లడించిన ఫలితాల్లో సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన ఆరుగురు హోంగార్డులు ఎస్‌పి వకుల్‌జందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఇప్పటి వరకు హోంగార్డులుగా సమర్థవంతంగా పని చేసారన్నారు. ఇకపై పోలీసుశాఖలో పూర్తి స్థాయిలో పనిచేసేందుకు కానిస్టేబుళ్ళగా ఎంపికకావడంతో మీపై బాధ్యతలు కూడా పెరిగాయన్నారు. కానిస్టేబుళ్ళగా ఎంపికైన హోంగార్డులు ఎం.నాగరాజు, జి.ఈశ్వరరావు, జె.గౌరి నాయుడు, బి. సత్యన్నారాయణ, టి.దేవి, ఎస్. గౌరినాయుడును ఎస్‌పి అభినందించారు. కార్యక్రమంలో హోంగార్డ్సు ఇన్చార్జ్ ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, ఇన్‌ఛార్జి హెచ్‌సిలు శ్రీను, రాజు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానని తెలిపారు.

లక్ష్య సాధనకు నిరంతర కృషి

విజయనగరంటౌన్ : విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని ప్రముఖ సైకాలజిస్టు ఎంజిఎల్ఎన్ మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన సీతం కళాశాలలో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులనుద్దేశించి 'ఇంజనీరింగ్ యువర్ ఫ్యూచర్: గోల్స్, గ్రోత్ అండ్ ది పవర్ ఆఫ్ ఫోకస్' అనే అంశంపై మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత, వృత్తి పరమైన లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి. రామమూర్తి, మొదటి సంవత్సరం విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్లు తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి-వంగర

వికలాంగుల పింఛన్లను తొలగించడం అన్యాయమని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి, ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. శుక్రవారం వంగరలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పింఛన్లు రద్దు చేసే, వికలాంగుల సర్టిఫికెట్లలో వైకల్య శాతాన్ని తగ్గించాలని వైద్యులకు లక్ష్యం విధిస్తోందని విమర్శించారు. వికలాంగులను పింఛన్ల రద్దుకు వ్యతిరేకంగా రోడ్డెక్కితే, వికలాంగ సర్టిఫికెట్లు పొందిన వైకల్య నిర్ధారణ చేసి పింఛన్లు మంజూరు చేశారని అన్నారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. వికలాంగులకు, రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రాజాంలో 6 బార్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రాజాం

రాజాం నగర పంచాయతీలో పరిధిలో ఆరు బార్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైపాల్ తెలిపారు. ఈ నెల 26 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని చెప్పారు. 28న ఉదయం లాటరీ ద్వారా లైసెన్సీలను ఎంపిక చేస్తామని, సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్ పాలసీ అమల్లోకి వస్తుందని వివరించారు. బార్ పాలసీలో అనేక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. దరఖాస్తు రుసుం గతంలో మాదిరి కేటగిరీలో రూ.10 లక్షలు ఉండగా, ఇప్పుడు అందరికీ ఒకే విధంగా రూ.5 లక్షలు చేశామన్నారు. బార్ వ్యాపారంలోకి కొత్తవారు రావాలనే ఉద్దేశంతో ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులు తప్పనిసరి చేశామని, దీనివల్ల గుత్తాధిపత్యం తగ్గుతుందని చెప్పారు. లైసెన్స్ ఫీజు ఆరు విడతల్లో చెల్లించే వెసులుబాటు కల్పించామన్నారు.

కేన్సర్ ఆసుపత్రి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని జిడిపాలెం గ్రామంలో శ్రీ సత్యసాయి దివ్యామృతం 100 పడకల కేన్సర్ ఆసుపత్రికి రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పది మంది పేద మహిళలకు అరవై వేల రూపాయల విలువ చేసే కుట్టుమిషన్ లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివ్యామృతం స్వామి మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి, రోడ్డు మంజూరుకు సహకారం అందిస్తున్న జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి నిర్మాణంలో ఒక బ్లాక్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరు పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కీర్తి, తహశీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జిల్లాలో అత్యాధునిక నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

త్వరలో జిల్లాలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను ప్రారంభిస్తామని నాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) జిల్లా సహాయ సంచాలకులు ఎం.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మాణ రంగంలో ప్రఖ్యాతి గాంచిన స్పింగ్ స్టేటర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ జిల్లాలోని ప్రభుత్వ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఎంఒయు జరిగిందని వెల్లడించారు. దీనిద్వారా తరగతి గదుల్లో సిద్ధాంత బోధనతోపాటు ప్రాజెక్ట్ సైట్లలో ప్రాక్టికల్ శిక్షణ, అభ్యర్థులకు అధునాతన పరికరాలు, భద్రతా కిట్లు, రవాణా సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. స్థానిక శిక్షకులు టిటిలింగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా యువతను సర్టిఫైడ్ మిషన్ ఆపరేటర్లు, సాంకేతిక నిపుణులుగా రూపొందిస్తామని, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వీరిని తీర్చిదిద్దుతామని సుధాకర్ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-వంగర

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్ మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూల్యాంకనం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అసెస్మెంట్ పుస్తకాల విధానం ద్వారా విద్యార్థుల బోధనకు సమయం వృథా అవుతోందన్నారు. ఈ విధంగా ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీసాల కూర్మినాయుడు, లంక రామకృష్ణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు వై.రామకృష్ణ, పి.శ్రీకర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి-రామభద్రపురం

సీజనల్ వ్యాధులపై ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారి లక్ష్మి సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రజలు కాచి వడపోసిన నీటిని తాగాలని తెలిపారు. ముఖ్యంగా కాలువలు, నీటి కుంటల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ప్రస్తుత వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, టీబీవలన మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు ఆదిలక్ష్మి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-వంగర

కళాకారులను ఆదుకోవాలని ఆ సంఘం మండల నాయకులు యలగాడ పోలిరాజు, మిరియాల జగన్, యలగాడ సింహాచలం కోరారు. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని వంగరలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పాటలు, పద్యాలు, డప్పు వాయిద్యాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరుగున పడుతున్న కళారూపాలను ముందుకు తేవాలని, కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందజేయాలని కోరారు. అర్హులైన వారందరికీ పింఛన్లు, రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పరుశురాం, పరసయ్య, మహేష్, అప్పారావు, అనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

దళిత, గిరిజన అటవీ ఉద్యోగులపై దాడి చేసిన టిడిపి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జైభీమ్ భారత్ పార్టీ నాయకులు బొంపెల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు, చిన్నం అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా దళిత, గిరిజనులపై దాడులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడ్డ ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మావిడి కుమార్‌రాజా పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కు సుందరీకరణకు చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

రాణి మల్లమ్మదేవి మున్సిపల్ పార్కు సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ రామలక్ష్మి ఆదేశించారు. పార్కును శుక్రవారం పరిశీలించారు. పార్కులో చెట్లకు ట్రిమ్మింగ్ చేయాలని, మరుగుదొడ్లకు నీరు సరఫరా చేయాలని ఆదేశించారు. పార్కును సుందరీకరణ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పార్కు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం గాంధీ బొమ్మ పరిసరాలను పరిశీలించి రోడ్లు, కాలువలను శుభ్రం చేయాలని ఆదేశించారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు సందర్శించారు. పాఠశాల పరిసరాలు, కిచెన్ గార్డెన్, తరగతి వారిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్ చదివించడం, రాయించడం వంటి చతుర్విధ ప్రక్రియలు చేయించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి వైద్యులు హాజరై పరీక్షలు చేశారు. బానాది, సింగరం, బల్లంకి, రెడ్డివానిపాలెం, పోతంపేట గ్రామాలకు చెందిన 206 మంది వైద్య సేవలు పొందారు. అవసరమైనవారికి మందులు అందజేశారు. శిబిరంలో వైద్యులు శ్రావణి, ప్రసన్నకుమార్, శివాజీ, షాలిని, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

పశువైద్య శిబిరం

వేపాడ : మండలంలోని భద్రవానిపాలెంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 35 పశువులకు పశువైద్యాధికారి గాయత్రి వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఉత్సవ కమిటీలదే బాధ్యత


ప్రజాశక్తి- సంతకవిటి

వినాయక మండపం ఏర్పాటు చేసినప్పటి నుండి నిమజ్జనం వరకు ఉత్సవ కమిటీదే పూర్తి బాధ్యతని రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు అన్నారు. శుక్రవారం సంతకవిటి పోలీస్ స్టేషన్‌లోని మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో వినాయక చవితి మండపాల అనుమతులకు రుసుం అవసరం లేదన్నారు. ప్రభుత్వ స్థలంలో విగ్రహాలు పెడితే తప్పనిసరిగా సంబంధిత అధికారులతో అనుమతులు తీసుకోవాలన్నారు. ఏమైనా అవాంఛనీయ సంఘటనలో జరిగితే కేసులు తప్పవని హెచ్చరించారు. అశ్లీల నృత్యాలు, డిజెలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డెంకాడ : మండలంలో గణేష్ మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గణేష్ మండపాలను ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్పీకర్లు ఉదయం 6 నుండి రాత్రి పది గంటల వరకు మాత్రమే వినియోగించాలన్నారు. బలవంతంగా చందాలు గాని, దర్శన టిక్కెట్లు గాని వసూలు చేయొద్దని కోరారు. అనుమతులు తీసుకోకుండా ఉత్సవాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రామభద్రపురం : వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ప్రసాదరావుతో కలిసి ఆయన మాట్లాడారు. వినాయక విగ్రహాల వద్ద, నిమజ్జనం సందర్భంగా డిజెలు, అశ్లీల నృత్యాలు, బాణసంచా వినియోగం చేపట్టరాదన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు సహకరించాలని కోరారు.

రాజాం : ఈనెల 27న జరుగనున్న వినాయక చవితి పండగ సందర్భంగా ఏర్పాటు చేసుకొనే గణేష్ పందిళ్ళు, మండపాలు ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు పొందాలని పట్టణ టౌన్ సిఐ కె. అశోక్ కుమార్ కోరారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించబోయే వ్యక్తులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్‌విండో విధానంతో https://ganeshutsav.net క్లిక్ చేసి, నిర్దేశించిన అనుమతులు పొందాలన్నారు. సింగిల్ విండో విధానంతో ప్రజలు సులభంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనానికి అనుమతులు పొందవచ్చునని తెలిపారు.



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న హరిబాబు

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

వేపాడ : మండలంలోని సింగరాయి, జగ్గయ్యపేట, ఉసిరి గ్రామాలకు హరిత సొసైటీ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరిత సొసైటీ ఉపాధ్యక్షులు చల్లా త్రినాథ్, సభ్యులు ఎం.అప్పలనాయుడు, ఆర్.భవాని, ఎం.గణేష్, కె.మహేష్, గేదెల అప్పలనాయుడు పాల్గొన్నారు.

యథాతథంగా డిగ్రీ అడ్మిషన్లు కొనసాగించాలి : ఎస్ఎఫ్ఐ

విజయనగరం టౌన్ : డిగ్రీ అడ్మిషన్లలో గందరగోళానికి తెరదించి యథాతథంగా అడ్మిషన్లు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి రాము, సి.హెచ్ వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు చేశారు. ప్రభుత్వం ఇప్పటికే డిగ్రీ అడ్మిషన్‌ల విషయంలో చాలా ఆలస్యం చేయడం వలన విద్యార్థులు నెలలు తరబడి చదువుకు దూరమయ్యారని తెలిపారు. తీరా అడ్మిషన్లు ప్రారంభమైనప్పటికీ సాంకేతిక లోపాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆఫ్‌లైన్ ద్వారా కూడా అడ్మిషన్లు చేసుకోవచ్చు అని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ఇప్పుడు ఆన్‌లైన్‌లోనే చేపట్టిందని తెలిపారు. ఈనెల 20న ప్రారంభమైన అడ్మిషన్లు గత మూడు రోజులుగా అనేక సమస్యల్ని ఎదుర్కొంటూ సర్వర్ ప్రాబ్లంతో ఇబ్బంది పడినప్పటికీ చాలామంది విద్యార్థులు ఎంట్రన్స్ ఫీజులు కట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నా, వాటిని ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు కట్టిన ఫీజుల్ని నష్టపోతున్నారని తెలిపారు. యథాతథంగా అడ్మిషన్లు ప్రక్రియను కొనసాగించాలని, లేకుంటే విద్యార్థి కట్టిన ఫీజుకు బాధ్యతగా మూడు రెట్లు అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే, పీడీ మధ్య నలుగుతున్న ఎపిఒ పోస్టు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎపిఒ పోస్టు సుమారు రెండేళ్లగా ఖాళీగా ఉంది. స్థానిక ఎమ్మెల్యే, డ్వామా పీడీ మధ్య ఆ పోస్టు నలిగిపోయి భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనిచేసిన ఎపిఒ వెంకటరమణ బదిలీపై వెళ్లిపోయిన తరువాత ఈ స్థానంలో పర్మినెంట్‌గా ఎవరినీ నియమించలేదు. రెండేళ్ల నుంచి ఇన్చార్జి ఎపిఒలతో కాలం గడుపుతున్నారు. ఎపిఒ లేకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయం సిబ్బంది, ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు అయితే ఇక్కడ పనిచేయడానికి ఎపిఒలు పోటీ పడుతున్నారు. అయినా ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల తీరు కారణంగా భర్తీ చేయడం లేదు. విజయనగరానికి ఆనుకొని ఉన్న మండలం కావడంతో ఎక్కువమంది ఇక్కడికి ఎపిఒగా రావడానికి పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వారంతా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక్కడకు ఎపిఒగా ఒకరిని పంపించడానికి డ్వామా పీడీ ప్రయత్నిస్తున్నారని తెలిసింది. అలాగే స్థానిక ఎమ్మెల్యే లోకం నాగ మాధవి కూడా తమకు అనుకూలంగా ఉండే ఎపిఒను ఇక్కడ నియమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనేపథ్యంలోనే ఎమ్మెల్యే, పీడీ మధ్య ఈ పోస్టు నలిగిపోయి భర్తీకి నోచుకోవడం లేదు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే మాట చెల్లుబాటు అవుతుందో, పీడీ మాట నెగ్గుతుందో వేచి చూడాల్సిందే.



ఉపాధి కార్యాలయం

ఆక్రమణలపై రెవెన్యూ కొరడా

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని బిరసాడవలసలో కోళ్లఫారం వద్ద ప్రభుత్వ భూమి ఆక్రమణలపై రెవెన్యూ శాఖ శుక్రవారం కొరడా ఝుళిపించింది. కోళ్లఫారం ప్రారంభం నుంచి ప్రభుత్వ భూమిని సుమారు 1.13 ఎకరాలను ఆక్రమించుకుని చుట్టూ గోడ నిర్మించి అనుభవిస్తున్నారు. కోళ్లఫారంతోపాటు చుట్టుపక్కల మరి కొంతమంది సుమారు 3.55 ఎకరాలను ఆక్రమించుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ శాఖ స్పందించి తక్షణ చర్యలు చేపట్టింది. ఆక్రమణలో నిర్మించిన గోడను జెసిబి సహాయంతో కూలగొట్టి ప్రభుత్వ భూమిని స్వాధీన పరచుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, విఆర్ఒ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమించి కట్టిన ప్రహరీని తొలగిస్తున్న జెసిబి



నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు, నిర్వాసితులు

కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని బొడ్డవరలో జిందాల్ పరిశ్రమకు భూములిచ్చిన నిర్వాసితులు చేపడుతున్న నిరసన కార్యక్రమం 61వ రోజు శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ జిందాల్ పరిశ్రమ యాజమాన్యం చేసే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అధికారులకు, రాజకీయ పెద్దలకు వాటాలు ఉన్నాయని తెలిపారు. అందుకే రెండు నెలలుగా నిర్వాసితులు ఆందోళన చేస్తున్నా అధికారులు గానీ, స్థానిక ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్వాసితులకు తిరిగి భూములిచ్చే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు.

మంచి సందేశం అందించారు : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

యూనివర్శిటీ సినిమా ద్వారా ఆర్.నారాయణమూర్తి మంచి సందేశం అందించారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు అన్నారు. శుక్రవారం దర్శకుడు ఆర్ నారాయణ మూర్తి దర్శకత్వం వహించిన యూనివర్సిటీ సినిమా విడుదలైన సందర్భంగా పట్టణంలోని టిబిఆర్ థియేటర్లో ఆయన సినిమా చూసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ప్రభుత్వ రాజకీయ వ్యవస్థలు ఎలా భ్రష్టు పట్టుకుపోతున్నాయో కళ్లకు కట్టినట్లుగా చూపించారని తెలిపారు. మరి ముఖ్యంగా చెప్పాలంటే విద్యా వ్యవస్థలో విద్యార్థులకు వాళ్ల తల్లిదండ్రులకు ఎదురవుతున్న సమస్యలను క్లుప్తంగా సినిమా ద్వారా వాళ్లకు అర్థమయ్యే రీతిలో నారాయణ మూర్తి దర్శకత్వం వహించి సినిమాను చాలా బాగా చూపించారని అభినందనలు తెలిపారు.

నాయుడుకాలనీలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

పట్టణంలోని నాయుడు కాలనీలో శుక్రవారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు నిర్వహించారు. వైసిపి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

13న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి-రాజాం

సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ కోరారు. శుక్రవారం రాజాం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ఫ్రీ లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నట్లు తెలిపారు. రాజీయే రాజమార్గమని, రాజీకి వీలైన ఎక్కువ కేసుల్లో లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపస్ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పాలకొండ హరిప్రియ, రాజాం బార్ అసోసియేషన్ సెక్రటరీ బి.తిరుపతినాయుడు, ప్రభుత్వ న్యాయవాది పి.శ్రీనివాసు, మాజీ అధ్యక్షులు రమణ మూర్తి, సీనియర్ న్యాయవాదులు ఆర్.రామ్మూర్తి, జె.అప్పలనాయుడు, వైఎస్.నివాస్, ఎస్.అప్పలనాయుడు, కె.కొండలరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి- సంతకవిటి

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి సిబి యశ్వంత్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎరువుల దుకాణాల్లో ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎంఆర్‌పికి మించి అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. మండలంలో 21 ఆర్ఎస్‌కెల ద్వారా 529.875 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు సరఫరా చేశామన్నారు. మరో 80 మెట్రిక్ టన్నుల ఎరువులు వాసుదేపట్నం, తమరాం, మండవకురిటి, గుళ్ళ సీతారాంపురం సచివాలయాలకు వచ్చాయన్నారు. రైతులకు ఎరువులు కొరత లేకుండా చూస్తామని తెలిపారు.



ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎఒ యశ్వంత్‌రావు

కుటిల రాజకీయాలను తిప్పికొట్టండి

ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గౌరీష్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కృష్ణ మహంతిపురం సొసైటీ చైర్మన్ ఎన్నిక పట్ల ఈ ప్రాంత పెత్తందారులు చేస్తున్న కుటిల రాజకీయాలను తిప్పి కొట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జె.గౌరీష్ కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ 1977లో సహకార సంఘం ఏర్పడిన నాటి నుంచి ఒకే కుటుంబం పదవిని అనుభవించినప్పుడు లేని ప్రాంతీయత, అనుభవం, అర్హత అత్యవసరంగా ఇప్పుడే ఎందుకు గుర్తొచ్చిందో ఒక్కసారి అర్థం చేసుకోవాలన్నారు. పదవీకాలం పూర్తయిన ప్రతిసారీ డైరెక్టర్ల పదవులను మాత్రమే పంచి చైర్మన్ పదవిని రాజుల గుప్పిట్లో పెట్టుకోవడాని చూస్తున్నారని తెలిపారు. చైర్మన్ పదవి బిసిలకు దక్కిందనే అక్కసుతో బాయ్ కట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

'ప్రభుత్వం మారితే సర్టిఫికెట్ పనిచేయదా?'

ప్రజాశక్తి-బొబ్బిలి

వికలాంగులకు గత ప్రభుత్వ హయాంలో అధికారులు పరీక్షించి, జారీ చేసిన సర్టిఫికెట్.. ప్రభుత్వం మారితే పనిచేయదా? అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి రాకముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట టిడిపి కూటమి ప్రభుత్వ పనితీరని దుయ్యబట్టారు. పింఛనే ఆధారంగా లక్షలాది మంది వికలాంగులు బతుకుతున్నారని తెలిపారు. వెరిఫికేషన్ పేరుతో పింఛన్లు తొలగించి, వికలాంగులను ఇబ్బందుల పాల్జేయడం సరికాదని హితవుపలికారు. కొత్తవారికి పింఛన్లు ఇవ్వకపోగా ఇస్తున్న పింఛన్లను నిలిపేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అర్హులందరికీ పింఛన్లు పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు.



కేకు కట్ చేస్తున్న జనసేన నాయకులు గురాన అయ్యలు

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలో మెగా సోల్జర్స్ , చిరంజీవి యువత ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ మెగా స్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం హోటల్ జిఎస్ఆర్ ఇంటర్నేషనల్‌లో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన జనసేన నాయకులు గురాన అయ్యలు కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి స్వయంకృషితో సినీరంగంలో ఎన్నో విజయాలను అందుకున్నారని కొనియాడారు. ఎన్నో అద్భుత పాత్రలు పోషించిన ఆయన వెండితెర ఆణిముత్యమని , తరాలు మారినా చెక్కుచెదరని ప్రేక్షకాభిమానం ఆయన సొంతమని అన్నారు. కార్యక్రమంలో మెగా సోల్జర్స్, చిరంజీవి యువత ప్రతినిధులు ఎంటి రాజేష్, అడబాల వెంకటేష్, మేడేపల్లి పవన్ ,భార్గవ్,కుమార్, జగదీష్ , సాయి, ఆనంద్, హిమంత్ పాల్గొన్నారు.




ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న రామ్ మల్లిక్ నాయుడు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి- చీపురుపల్లి

ప్రజా సమస్యల పరిష్కారంమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు అన్నారు. శుక్రవారం చీపురుపల్లిలోని టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయన స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, వారికి అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, గరివిడి మండల నాయకులు పైల బలరాం, సారిపాక సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎఎంసి చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎఎంసి చైర్‌పర్సన్‌కు అభినందన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పూసపాటిరేగ ఎఎంసి చైర్‌పర్సన్ గేదెల గాయత్రిదేవిని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర అభినందించారు. శుక్రవారం దన్నానపేటలో గాయత్రి, రాజారావు దంపతులను ఆయన సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లావేరు మాజీ సర్పంచ్ మాకన శంకరరావు, సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి కూర్మారావు, టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు పోతల రాజప్పన్న, తంగుబిల్లి ఎంపిటిసి చందక చిన్నంనాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షులు నల్లం శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు ఇనపకుర్తి పోతన్నదొర పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంతో సమయం ఆదా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ చేయడం వల్ల సమయం ఆదా అవుతుందని మండల వ్యవసాయ అధికారి రవీంద్ర అన్నారు. కొత్తగా మంజూరైన డ్రోన్‌ను శుక్రవారం మండలంలోని సంతగౌరమ్మపేట గ్రామంలో బ్యాంకు అధికారుల సమక్షంలో ఆవిష్కరించారు. యూరియా కొరత ఉన్నప్పుడు లీటర్ నానో యూరియాను నిమిషాల వ్యవధిలోనే ఎకరాకు పిచికారీ చేయొచ్చని ఆయన తెలిపారు.

నేరాలు ఘోరాలు

చెరువులో దూకేసిన వ్యక్తి

ఆచూకీ కోసం గాలింపు

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

మండలంలోని ఎం.బూర్జవలస చెరువులో గుర్తు తెలియని వ్యక్తి దూకేశాడు. దీన్ని చూసిన మహిళా రైతు బి.సన్యాసమ్మ గ్రామ యువకులకు వెంటనే చెప్పారు. జి.అప్పలనాయుడు, నూకరాజు, సత్యనారాయణ, రమేష్ గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రమేష్, ఎఎస్ఐ సన్యాసిరావు, అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని స్థానికులతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆచూకీ లభించక పోవడంతో పోలీసులు, అగ్నిమాపక అధికారులు వెనుదిరిగారు.

తోటపల్లి కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని సింగిరెడ్డివలస గ్రామానికి చెందిన జమ్మల శంకరరావు (50) తోటపల్లి కాలువలో పడి మృతిచెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు తహశీల్దార్ హేమంత్‌కుమార్, ఎస్ఐ సాగర్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శంకరరావుకు భార్య అప్పమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మృతిచెందిన శంకరరావు

వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నగరంలోని రంగాల వీధిలో వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్ టౌన్ పోలీసులు కథనం ప్రకారం.. రంగాల వీధిలో తాడిశెట్టి శంకర్రావు (67) నివాసం ఉంటున్నాడు. అప్పులు ఎక్కువ చేయడం వల్ల మానసిక ప్రశాంతంగా లేపడం లేకపోవడంతో మానసికంగా ఇబ్బందులు పడేవాడు. ఈనెల 20న మధ్యాహ్నం ఇంట్లో సల్ఫర్ యాసిడ్ తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు విజయనగరం వన్ టౌన్ సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.